


sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే



హైదరాబాద్ | 06-10-2026 మంగళవారం | సంపుటి-02 సంచిక : 164 EDITOR: ROHINI

రామప్ప గుండెల్లో సింగరేణి బాంబు

బొగ్గు గనుల తవ్వకాలతో ప్రమాదం

- కాకతీయ వైభవాన్ని నాశనం చేస్తారా?
- ప్రపంచ వారసత్వ హోదా రద్దవుతుందా?
- రామప్ప చెరువుకు గండికొట్టే కుట్ర
- 15 గ్రామాల ప్రజల మహా తిరుగుబాటు
- ఉద్యమానికి కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ శ్రీకారం

మన చరిత్రకు గుండెకాయ లాంటి రామప్ప ఆలయాన్ని, ఆ పక్కనే ప్రశాంతమైన రామప్ప చెరువును బొగ్గు గనుల తవ్వకాల్లో ముంచెత్తేందుకు సింగరేణి సంస్థ సిద్ధమవుతోందా? ములుగు జిల్లా వెంకటాపురంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిని తవ్వాలని చూస్తున్న తీరుపై ఇప్పుడు సర్వత్రా నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, ఇతర సాంస్కృతిక వేత్తలు అంతా కలిసి ఈ ప్రాజెక్టును తక్షణమే ఉపసంహరించుకోవాలని గగ్గోలు పెడుతున్నారు. సుమారు 800 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ యునెస్కో వారసత్వ కట్టడాన్ని కాపాడుకోవడానికి 15 గ్రామాల ప్రజలు దసరా పండుగ తర్వాత ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

- సహనం వందే, వరంగల్



వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగరావు ప్రకారం... ఈ ఓపెన్ కాస్ట్ గని రామప్ప ఆలయానికి, చెరువుకు కేవలం 5 కిలోమీటర్ల దిగువన ఉంది. అక్కడికి 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరపాలని చూస్తున్నారు. భౌగోళిక సర్వే నివేదికల ప్రకారం రామప్ప చెరువులోని నీరు భూగర్భ మార్గాల ద్వారా ఈ గని వైపు ప్రవహించే అవకాశం ఉంది. చెరువు దగ్గర నీటి ప్రవాహాన్ని అడ్డుకునే కట్ ఆఫ్ ట్రెంచ్ లేకపోవడం వల్ల లోతైన తవ్వకాలతో నీటి ఇంకుడు వేగవంతమవుతుంది. దీనివల్ల రామప్ప గుడికి వాడిన ఇసుక పునాది దెబ్బతిని ఆలయం కుంగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ప్రకంపనల దెబ్బకు శిల్పాలు తట్టుకోగలవా?

పైకి చూడటానికి గని పేలుళ్ల ప్రభావం తక్కువే అని నివేదికలు చెబుతున్నా, పదే పదే జరిగే పేలుళ్ల ప్రకంపనలు ఆలయంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇప్పటికే రంగా మండపంలో దూలాలు విరగడం, నేల కుంగడం లాంటి సమస్యలతో గుడి పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. పైగా ఈ తవ్వకాల వల్ల చుట్టుపక్కల ఉండే జీవవైవిధ్యం, పర్యావరణం, స్థానిక ప్రజల సామాజిక, ఆర్థిక జీవనం పూర్తిగా నాశనమవుతాయి. అందుకే సింగరేణి సంస్థ ఈ ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆలయం దగ్గర బొగ్గు గని ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం...

ఈ ప్రాజెక్టును ఆపాలని కోరుతూ కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధి పాండురంగారావు నాయకత్వంలో ఒక బృందం హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసింది. సింగరేణి సంస్థ పనులు చేపట్టేందుకు సిద్ధమవుతోందని, మంత్రి వెంటనే జోక్యం చేసుకుని ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని విన్నవించింది.మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, సామాజిక వేత్త మండపా శశిధర్ రావు లాంటి నాయకులు ప్రజా ఉద్యమానికి పిలుపునిచ్చారు. రామప్ప చెరువుకు గండిపడితే మునిగిపోయే గ్రామాలన్నింటిలో పర్యటించి, బొగ్గు గని వల్ల వచ్చే ముప్పు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెబుతున్నారు.

ప్రపంచ వారసత్వ హోదాకే పెద్ద ముప్పు!

మరొక ఉద్యమకారుడు మందల పరశురాములు మాట్లాడుతూ, రామప్ప ఆలయానికి వచ్చిన యునెస్కో ప్రపంచ వారసత్వ హోదాను కాపాడుకోవడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. చుట్టుపక్కల బొగ్గు తవ్వకాలు జరిపితే ఆ హోదా పోయే ప్రమాదం ఉంది. తెలంగాణకు గర్వకారణమైన ఒక చారిత్రక సంపదను కాపాడుకోవడానికి ప్రజలంతా ఏకమై పోరాడాల్సిన సమయం వచ్చింది.

అడ్డంగా దొరికిన మేడమ్స్

ఏసీబీ వలలో మహిళా అధికారులు

- లక్షతో పట్టుబడిన రంగారెడ్డి డీఎంహెచ్ఓ
- 4 లక్షలతో దొరికిన జీహెచ్ఎంసీ సునీత
- జీతాలు లక్షల్లో... బుద్ధి మురికి గుంటలో!

కష్టపడి చదివి ఉద్యోగాలు సాధిస్తే కన్నవాళ్కు ఎంతో మురిసిపోతారు. ఉద్యోగంలో మంచి పేరు తెచ్చుకుని ప్రమోషన్లు సాధిస్తే ఉన్నత స్థానాలకు వెళ్తారు, సమాజంలో గొప్ప గౌరవం పొందుతారు. కానీ అదే డబ్బు యావలో దిగజారిపోతే తమ కింద పనిచేసే అటెండర్లు కూడా కనీసం మనుషులుగా చూడరు. లక్షల్లో జీతాలు, అదనపు సౌకర్యాలు అనుభవిస్తూ లంచాలకు కక్కుర్తిపడి ఏసీబీకి పట్టుబడిన ఇద్దరు మహిళా అధికారుల తీరు చూస్తే ఎవరికైనా అసహ్యం వేయక మానదు.

- సహనం వందే, హైదరాబాద్



రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య అధికారి స్వర్ణకుమారి కథే చూద్దాం. జిల్లా పెద్ద అధికారి అయిన ఈమె కక్కుర్తి చూస్తే మతిపోవాల్సిందే. తన వద్ద పనిచేసే హెల్త్ ఇన్స్పెక్టర్, డ్రైవర్‌తో చేతులు కలిపి అవినీతి అక్రమాలకు తెరలేపింది. మూతపడిన ఒక ఫిజియోథెరపీ కేంద్రాన్ని తిరిగి తెరిచేందుకు లంచం డిమాండ్ చేసి చివరికి ఏసీబీ అధికారుల వలలో చిక్కుకుంది. హోదాకు తగ్గట్టు నడుచుకో వాల్సిన అధికారిణి ఇలా దిగజారిపోవడం ఘోరం.

4 లక్షలు లంచం తీసుకుంటూ...

ఇక మరో అధికారిణి జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తులసీరామ్ సునీత. ఈమె ప్రస్తుతం జోనల్ కార్యాలయంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించిన ఒక బిల్డర్‌కు అనుకూలంగా పనిచేసేందుకు ఈమె లంచం డిమాండ్ చేశారు. అందులో అడ్వాన్స్ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.

చివరికి మిగిలింది కన్నీళ్లే

లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన మరుక్షణంలో సునీత షాక్‌కు గురై బోరున విలపించారు. తలెత్తుకుని దర్జాగా ఉద్యోగం చేస్తూ సమాజంలో బతకాల్సిన చోట, ఇలాంటి అధికారులు లంచాలకు అలవాటు పడి తమ పరువును తామే తీసుకుంటున్నారు. చివరకు సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితిని తెచ్చుకుంటున్నారు.

అటెండర్ కూడా గౌరవించని బతుకులు

ప్రభుత్వం నెలకు జీతాలు ఇస్తున్నా, సౌకర్యాలు కల్పిస్తున్నా ఈ అధికారులకు ఆశ చావడం లేదు. వృత్తిపరంగా అవినీతికి అలవాటు పడి అక్రమార్జన బాట పట్టడం వల్ల చివరికి జైలు పాలవుతున్నారు. సమాజంలో పరువు పోవడమే కాకుండా, కనీసం పనిచేసే చోట అటెండర్లు కూడా గౌరవించని స్థితికి చేరుకుంటున్నారు.

మోక్షజ్ఞతో బాలయ్య ముద్దుగుమ్మలు

డెబ్యూ మూవీలో రవీనా టాండన్, శోభన

- మోక్షజ్ఞకు జోడీగా శ్రీలీల నటించే అవకాశం
- వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ కథ

నందమూరి అభిమానులకు ఇది పూనకాలు తెప్పించే వార్త. మోక్షజ్ఞ ఎంట్రీ సినిమాతోనే సరికొత్త సంచలనాలకు తెరలేపబోతున్నారా? బాలకృష్ణ తనయుడి తొలి సినిమాపై రోజుకో ఆసక్తికరమైన ప్రచారం బయటకు వస్తూ నెట్టింట రచ్చ లేపుతోంది. బింబిసార డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

- సహనం వందే, హైదరాబాద్



ఈ సినిమాలో బాలకృష్ణతో గతంలో జతకట్టిన స్టార్ హీరోయిన్లు కనిపించబోతున్నారనే వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. బంగారు బుల్లోడులో బాలయ్య సరసన మెరిసిన రవీనా టాండన్, నారీ నారీ నడుమ మురారిలో కలిసి నటించిన శోభన ఈ మూవీలో కీలక పాత్రల్లో కనిపిస్తారట. రవీనా టాండన్ నెగెటివ్ షేడ్స్ ఉన్న రోల్ చేస్తుండగా, శోభన మోక్షజ్ఞ తల్లిగా కనిపించ నున్నారనే ప్రచారం గట్టిగా సాగుతోంది.

శ్రీలీలతో మోక్షజ్ఞ క్రేజీ కాంబో

మరోవైపు కథానాయికగా యంగ్ సెన్సేషన్ శ్రీలీల పేరును మేకర్స్ పరిశీలిస్తున్నట్లు జోరుగా వార్తలు వస్తున్నాయి. భగవంత్ కేసరిలో బాలయ్యతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్న శ్రీలీల... ఇప్పుడు మోక్షజ్ఞతో జోడీ కడితే ఈ కాంబినేషన్‌కు ఎక్కడలేని క్రేజ్ వస్తుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఈ ఇంట్రెస్టింగ్ కాంబోపై నందమూరి అభిమానుల్లో కూడా విపరీతమైన ఆసక్తి వ్యక్తమవుతోంది.

సెకండాఫ్‌లో బాలకృష్ణ మాస్ ఎంట్రీ

ఇది చాలదన్నట్లు ఈ సినిమాలో నటసింహం నందమూరి బాలకృష్ణ కూడా ఓ కీలక పాత్రలో మెరవబోతున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్‌లో మోక్షజ్ఞ తండ్రిగా బాలయ్య ఇచ్చే ఎంట్రీ థియేటర్లలో పూనకాలు తెప్పిస్తుందని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఇక రవీనా టాండన్ ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సోషల్ మీడియాలో వస్తున్న లీకులు, రూమర్స్‌లోనే ఆమె పేరు వచ్చిందా లేక నిజంగానే ఓకే అయ్యారా అనేది మేకర్స్ స్పందించే వరకు వేచి చూడాల్సిందే.

భారీ సోషియో ఫాంటసీ ఫిల్మ్...

రొటీన్ కమర్షియల్ మాస్ సినిమాతో కాకుండా... మోక్షజ్ఞను ఓ విలక్షణమైన కాన్సెప్ట్‌తో పరిచయం చేయాలని భావిస్తున్నారు. మల్టిపుల్ టైమ్‌లైన్స్, పునర్జన్మల కథాంశంతో భారీ సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ మూవీ తెరకెక్కనుంది. విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యం ఉన్న ఈ కథ మోక్షజ్ఞకు మొదటి సినిమాతోనే డిఫరెంట్ ఇమేజ్ తీసుకువస్తుందని గట్టిగా నమ్ముతున్నారు.